క్లుప్తంగా

పోస్టల్ సేవలపై అవగాహన


పోస్టల్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీకిశోర్

అరకులోయటౌన్: పోస్టాఫీసు బీమా పథకాలు ఎంతో ఉపయోగమని అరకులోయ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ వి.లక్ష్మీ కిశోర్ చెప్పారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఈనెల 21, 22 తేదీల్లో అరకులోయ పోస్టాఫీసులో పోస్టల్ బీమా పథకాలపై మేళా నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా చిన్నారుల కోసం సుకన్య సమృద్ధి అయోజన్, ఇతరత్రా పథకాలపై అవగాహన, బీమా నమోదు తదితర సేవలు చేపడుతున్నామన్నారు.ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముఖ్యంగా బాలికల తల్లిదండ్రులు ఈ మేళాకు వచ్చి పోస్టాఫీసు సేవలు పొందవచ్చన్నారు.

ఇంకుడుగుంతలు తప్పనిసరి


మాట్లాడుతున్న ఎంపీడీవో ప్రసాద్

కొయ్యూరు: ప్రతీ ఇంటిలో ఇంకుడుగుంతలు ఏర్పాటుచేసుకునేలా గ్రామస్తులకు వీఆర్పీలు అవగాహన కల్పించాలని ఎంపీడీవో ప్రసాద్ కోరారు. ఆయన వీఆర్పీలతో సోమవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ఇంకుడు గుంతల వల్ల కలిగే లాభాలను వివరించాలన్నారు. ఉపాధి జాబ్ కార్డులు కలిగిన వారు విధిగా వంద రోజుల పనులను పూర్తి చేయాలన్నారు. అర్హులందరికీ పనులు కల్పించాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. మండలంలో అన్నిచోట్ల పనులను ప్రారంభించాలని ఆయన ఆదేశించారు. ఏపీవో శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే ప్రజా సమస్యల పరిష్కారం


మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీదేవి

రంపచోడవరం: మండలంలో ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా కృషి చేయాలని ఎంపీపీ బందం శ్రీదేవి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బందం శ్రీదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీపీ శ్రీదేవి, జెడ్పీటీసీ సభ్యురాలు పండా వెంకటలక్ష్మి, ఎంపీడీవో శ్రీనివాసుదొర తదితరులు మాట్లాడారు. వార్షిక బడ్జెట్ వివరాలు, ప్రతిపాదనలు తదితర అంశాలపై తీర్మానాలు చేశారు. ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు


అసరాడలో నీటి కుళాయిలను ప్రారంభిస్తున్న ఎంపీపీ బోయినకుమారి

గూడెంకొత్తవీధి: మండలంలోని పలు గ్రామా ల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని గూడెంకొత్తవీధి ఎంపీపీ బోయిన కుమారి అన్నారు. మండలంలోని రింతాడ పంచాయతీ అసరాడలో రూ.16లక్షల వ్యయంతో జల్‌జీవన్ మిషన్ కింద చేపట్టిన నీటి ట్యాంకు, కుళాయిలను ఆమె సోమవారం ప్రారంభించారు. సర్పంచ్ లక్ష్మి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొబ్బిలి లక్ష్మణ్ తదితరు లు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రీ ఫైనల్ పరీక్షలు ప్రారంభం


గురుకుల కళాశాలలో పరీక్ష రాస్తున్న ఇంటర్ బాలికలు

రాజవొమ్మంగి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, గిరిజన బాలికల గురుకుల జూనియర్ కళాశాలల్లో సోమవారం ఇంటర్ ఫస్ట్, సెకండియర్ ప్రీ ఫైనల్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. తొలి రోజు ఆయా కళాశాలల్లో జరిగిన తెలుగు-1, తెలుగు-2 పరీక్షలకు మొత్తం 455 మంది విద్యార్థులు హాజరైనట్టు సిబ్బంది తెలిపారు. సంక్రాంతి సెలవుల అనంతరం కళాశాలలు తెరవగా, అదే రోజు పరీక్షలు మొదలు కావడంతో కొంత మంది పరీక్షలకు గైర్హాజరయ్యారు.

సర్కారు వైద్యం.. దయనీయం

- రాజేంద్రపాలెం పీహెచ్‌సీలో మూలకు చేరిన అంబులెన్స్
- అరకొర వైద్యులు • ఆందోళనలో రోగులు • పట్టించుకోని అధికారులు


అంబులెన్స్ లేక బైక్‌పై రోగిని తీసుకెళ్తున్న బంధువులు (ఫైల్)

కొయ్యూరు: గిరిజనులకు వైద్యం అందని ద్రాక్షగా మారింది.. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అరకొర వైద్యులు, నామమాత్రంగా మందులు.. మూలకు చేరిన అంబులెన్స్.. అందని సేవలతో రోగులకు తిప్పలు తప్పడం లేదు.. డోలీమోతలే శరణ్యంగా మారాయి.. మన్యంలో డోలీమోతలు లేకుండా చేస్తామని కూటమి ప్రభుత్వ పాలకుల ప్రకటనలు.. నీటి మూటలుగానే మారాయి.. సకాలంలో వైద్యం అందక అమాయక గిరిజనులు మృత్యువాత పడుతున్న సంఘటనలు కోకొల్లలు..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో చెంతకే వైద్య సేవలు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఇంటి వద్దకే వైద్య సేవలు అందేవి.. ప్రతి పీహెచ్‌సీ, సీహెచ్‌సీలు వైద్యుల కొరత లేకుండా.. మందుల స్టాక్ నిండుగా ఉండేది...అన్ని వేళల్లో వైద్యులు అందుబాటులో ఉండేలా నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. దీంతో పాటు ఫ్యామిలీ డాక్టర్ పేరుతో గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి వైద్య సేవలు అందించేవారు.. దీంతో గిరిజనుల చెంతకే ప్రభుత్వ వైద్య సేవలు అందేవి.

కూటమి సర్కారు పాలనలో అందని వైద్యం

నేడు కూటమి ప్రభుత్వ పాలనలో గిరిజనులకు సర్కారు వైద్యం దూరమైంది.... పీహెచ్‌సీ, సీహెచ్‌సీల్లో వైద్యులు లేక అంబులెన్స్ సేవలు అందక అడవిబిడ్డలు పడుతున్న కష్టాలు వర్ణనాతీతం. అమాయక గిరిజనులు అప్పులు చేసుకొని ప్రైవేట్ వైద్యం పొందాల్సిన దుస్థితి నెలకొంది. మండలంలోని రాజేంద్రపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అనారోగ్యం సోకింది. నెలల తరబడి అనేక సమస్యలతో సతమతమవుతుంది. రాజేంద్రపాలెం ప్రభుత్వ వైద్యశాలలో అంబులెన్స్ సౌకర్యం లేకపోవడంతో వంద గ్రామాల ప్రజలు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఈ ఆస్పత్రికి కేటాయించిన అంబులెన్స్ పూర్తిగా పాడై మూలన పడింది. అప్పటి నుంచి మరమ్మతులు చేయలేదు. దీంతో క్షతగాత్రులను, అత్యవసర పరిస్థితుల్లో రోగులను ఇతర వైద్యశాలలకు తరలించడానికి ఎన్నో వ్యయప్రయాసలు ఎదుర్కోవలసి వస్తోంది. అంబులెన్స్ లేకపోవడంతో మృతదేహాలను తరలించేందుకు బంధువులు తీవ్ర అవస్థలకు గురికావలసి వస్తోంది. ప్రైవేటు వాహనాలు, ద్విచక్రవాహనాలపై ఆధారపడాల్సి వస్తోంది. పీహెచ్‌సీలో కనీస సౌకర్యాలు లేక రోగులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇటు ప్రభుత్వం...అటు అధికారులు పట్టించుకోవడం పట్టించుకోకపోవంతో రోగులకు కష్టాలు పెరిగిపోతున్నాయి.


రాజేంద్రపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

అత్యవసర సేవలకు తప్పని పాట్లు

దాదాపుగా వంద గ్రామాలకు కేంద్రంగా ఉన్న ఈ ఆస్పత్రికి రోజూ 150 మంది రోగులు వస్తుంటారు.. అయితే అంబులెన్స్ లేకపోవడడంతో పాటు ఒక్కరే వైద్యులు కావడంతో రోగులకు కష్టాలు ఎక్కువయ్యాయి. గతంలో ఇచ్చిన అంబులెన్స్ పూర్తిగా పాడై మూలకు చేరింది. నాటి నుంచి కొత్త అంబులెన్స్ రాలేదు. భారతీయ న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ సీఎస్ఆర్ సేవల ద్వారా కొత్త అంబులెన్స్‌లు వస్తాయని.. ఒక దానిని రాజేంద్రపాలెం పీహెచ్‌సీకి కేటాయిస్తామని ఐటీడీఏ పీవో అభిషేక్ కొద్ది నెలల క్రితం ప్రకటించారు. నేటి వరకు అంబులెన్స్ రాలేదని పలువురు చెబుతున్నారు. ఫలితంగా శివారు గ్రామాల రోగులు నరక యాతన పడుతున్నారు.

గత్యంతరం లేక ఆటోలు, ద్విచక్రవాహనాలపై పీహెచ్‌సీకి తీసుకురావాల్సిన దుస్థితి నెలకొంది. ఇక్కడ పనిచేస్తున్న వైద్యురాలిని విజయనగరం డెప్యూటేషన్ వేశారు. ఇది జరిగి 20 రోజులు కావస్తున్నా ఇప్పటివరకు ఎవరిని ఆ స్థానంలో నియమించలేదు. ఉన్న ఒక్క వైద్యులు అటు ఓపీతో పాటు ఇటు వైద్య శిబిరాల ఏర్పాటుకు అవస్థలు పడుతున్నారు.

అంబులెన్స్ కేటాయించాలి

రాజేంద్రపాలెం పెద్ద ఆస్పత్రి కావడంతో ఇక్కడ అంబులెన్స్‌ను ఇవ్వాలి. అంబులెన్స్ లేకపోవడంతో రోగులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే అంబులెన్స్ సౌకర్యం కల్పించాలి.

ఎస్.సూరిబాబు, బూదరాళ్ల

తప్పని ఇబ్బందులు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఫోన్ చేయగానే అంబులెన్స్ వెంటనే వచ్చేది. ఇపుడు అంబులెన్స్ సేవలు అందక ఇబ్బందులు తప్పడం లేదు. అత్యసర సమయాల్లో రోగులను ఆస్పత్రికి తరలించేందుకు ద్విచక్రవాహనాలు, ఆటోలను ఆశ్రయించాల్సి వస్తోంది. ఇబ్బందులు తప్పడం లేదు.అంబులెన్స్ సౌకర్యం కల్పించాలి.

రాజుబాబు, గోధుమలంక, కొయ్యూరు

ప్రతిపాదనలు పంపాం

రాజేంద్రపాలెం పీహెచ్‌సీ ద్వారా సమీపంలో చాలా గ్రామాలకు సేవలందించే పెద్ద ఆస్పత్రిగా పేరొంది. ఇక్కడ వైద్యుల భర్తీ కోసం..అంబులెన్స్ కోసం ప్రతిపాదనలు పంపాం. మంజూరైన వెంటనే రోగులకు అంబులెన్స్ సేవలను అందుబాటులోకి తీసుకొస్తాం.

సంపత్‌బాబు, వైద్యులు, రాజేంద్రపాలెం

పాఠశాలల్లో అరకొరగా విద్యార్థుల హాజరు

కొయ్యూరు: పండగ సెలవుల అనంతరం సోమవారం పాఠశాలలు తెరిచినా విద్యార్థులు మాత్రం రావడం లేదు. ఆశ్రమ పాఠశాలల పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. సెలవులు పూర్తయిన తరువాత పాఠశాలలు తెరిచిన వెంటనే విద్యార్థులు రావాలని ఉపాధ్యాయులు ఆదేశించినా విద్యార్థులు పట్టించుకోవడం లేదు. మండలంలోని పలు పాఠశాలల్లో అరకొరగానే విద్యార్థులు హాజరయ్యారు. ఈ విషయాన్ని ఏటీడబ్ల్యూవో క్రాంతికుమార్ వద్ద ప్రస్తావించగా విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్లు చేసి పాఠశాలకు వెంటనే పిల్లలను పంపాలని చెబుతున్నామన్నారు. ఉపాధ్యాయులు కూడా తమ వంతుగా విద్యార్థులను త్వరగా పంపాలని తల్లిదండ్రులకు సమాచారం చేరవేస్తున్నారు.

నేటి నుంచి ఆధార్ స్పెషల్ డ్రైవ్

అనంతగిరి(అరకులోయటౌన్): మండలంలోని అనంతగిరి, టోకూరు సచివాలయాల్లో ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్టు ఎంపీడీవో కుమార్ తెలిపారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ ఈ ఆధార్ క్యాంప్‌లో చిన్న పిల్లలకు కొత్తగా ఆధార్ నమోదు, బయోమెట్రిక్ అప్‌డేట్, ఆధార్ వివరాల్లో మార్పుచేర్పులు చేయనున్నట్టు పేర్కొన్నారు. ఈ ప్రత్యేక ఆధార్ క్యాంప్‌లను మండవాసులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో కుమార్ కోరారు.

మండల అభివృద్ధికి కృషి


ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డిని కలిసిన ఎంపీడీవో లక్ష్మణరావు

గంగవరం: గంగవరం ఎంపీడీవోగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన వై.లక్ష్మణరావు సోమవారం ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డిని ర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండలం అభివృద్ధి, గ్రామాల్లో సమస్యలపై చర్చించారు. మండలం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించేందుకు తగిన కృషి చేస్తామని ఎంపీడీవో చెప్పారు. అలాగే ఎంపీడీవో లక్ష్మణరావును కొత్తాడ సర్పంచ్ కామరాజుదొర, మండల పరిషత్ ఉద్యోగులు కలిసి అభినందనలు తెలిపారు. ఇక్కడ ఇప్పటివరకు దేవీపట్నం మండల ఈవోపీఆర్డీ పి.జి.రామకృష్ణ ఇన్‌చార్జి ఎంపీడీవోగా వ్యవహరించారు.

పశువ్యాధులపై అవగాహన అవసరం


దుంబ్రిగుడులో పశువుకు టీకాలు వేస్తున్న సిబ్బంది


అనంతగిరిలో మేకలకు మందు వేస్తున్న సిబ్బంది


నల్లగొండలో పశువుకు చికిత్స చేస్తున్న వైద్యులు, సిబ్బంది


బర్రిమామిడి పశువైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడుతున్న జెడ్పీటీసీ బేబీరత్నం


మందులు పంపిణీ చేస్తున్న రాజవొమ్మంగి పశువైద్యాధికారి డాక్టర్ తరుణ్, సర్పంచ్ లక్ష్మి


తోటకూరపాలెంలో పాడిరైతులకు మందులు అందజేస్తున్న సిబ్బంది


ఎటపాకలో రైతులకు మందులు పంపిణీ చేస్తున్న సిబ్బంది

దుంబ్రిగుడ: జిల్లా వ్యాప్తంగా గ్రామాల్లో పశువైద్య శిబిరాలను సోమవారం ప్రారంభించారు. పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామాల్లోని పశువులు, మేకలకు వ్యాధులు రాకుండా టీకాలు వేశారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారులు తదితరులు మాట్లాడుతూ పశువుల ఆరోగ్యంపై జాగ్రత్తలు పాటించాలన్నారు. అనారోగ్యానికి గురైన పశువులను మంద నుంచి వేరు చేసి చికిత్స అందించాలన్నారు. పశువుల శాలలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈనెల 31వ తేదీ వరకు పశువైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పశువులకు వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. నట్టల నివారణ వ్యాక్సిన్ వేశారు. పశువులకు డీవర్మింగ్, తదితర వ్యాధులకు చికిత్స అందించి మందులు పంపిణీ చేశారు. దుంబ్రిగుడ మండలంలోని కురిడి, అరకు గ్రామాల్లో పశువైద్యాధికారి డాక్టర్ రాజశ్రీ, సిబ్బంది సంజీవ్, దివ్య, సుబ్బారావు, మనోజ్, అప్పారావు, అనంతరావు, లోకేష్, ప్రకాష్, రత్నం, రమేష, శెట్టి, జయరాజు తదితరులు పాల్గొన్నారు.

హుకుంపేట: మండలంలోని బొడ్డాపుట్టు, బాకురు తదితర గ్రామాల్లో జరిగిన కార్యక్రమంలో పశువైద్యాధికారి డాక్టర్ చరణ్ మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో 348 పశువులకు, 275 మేకలకు నట్టల నివారణ మందు వేసినట్టు చెప్పారు.సిబ్బంది ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

అనంతగిరి(అరకులోయటౌన్): మండలంలో అనంతగిరి, ఎగువశోభ ప్రాంతాల్లో జరిగిన కార్యక్రమంలో పశు వైద్యాధికారులు డాక్టర్ ఎస్.గణేశ్వరరావు, సందీప్ మాట్లాడుతూ ఆయా ప్రాంతాల్లో 124 పశువులకు, 210 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందలు, 30 పశువులకు వివిధ వైద్య పరీక్షలు, 680 కోళ్లకు నట్టల నివారణ వ్యాక్సినేషన్ వేసినట్టు వారు తెలిపారు.

కొయ్యూరు: మండలంలోని రావణాపల్లి, నల్లగొండలో నిర్వహించిన కార్యక్రమంలో పశువైద్యాధికారి కె.రాజేష్‌కుమార్ మాట్లాడుతూ ఆయా ప్రాంతాల్లో 46 పశువులకు టీకాలు వేశామన్నారు. వెటర్నరీ డాక్టర్ ప్రసన్నకుమార్, సర్పంచ్ రాజకుమారి, వీఏలు శ్రీనివాస్, శివకుమార్ పాల్గొన్నారు

గంగవరం: మండలంలోని బర్రిమామిడి, నెల్లిపూడి గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమంలో వైద్యాధికారి అప్పన్నబాబు మాట్లాడుతూ ఆయా ప్రాంతాల్లో 45 పశువులకు గాలికుంటు నివారణ టీకాలు, 158 మేకలకు, 126 గొర్రెలకు డీవర్మింగ్ మందు పట్టించినట్టు చెప్పారు.జెడ్పీటీసీ సభ్యురాలు బేబీరత్నం, సర్పంచ్ కుంజం తమ్మన్నదొర తదిరులు శిబిరాలు ప్రారంభించారు. లైవ్ స్టాక్ అసిస్టెంట్‌లు అనంతలక్ష్మి, రాజు, సిబ్బంది వెంకటేశ్వర్లు, నాగేశ్వరావు, బషీర్, గౌతమ్, కీర్తన, చిన బాబు, క్రాంతి, తరుణ్, నవ్య పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: మండలంలోని బడదనాంపల్లి, గడుఓకుర్తిలలో జరిగిన కార్యక్రమంలో పశు వైద్యాధికారి డాక్టర్ తరుణ్ మాట్లాడుతూ గ్రామాల్లో పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేశామన్నారు. సర్పంచ్ లక్ష్మి దుర్గ, ఎంపీటీసీ సభ్యురాలు లోవకుమారి, వైస్ సర్పంచ్ సుబ్రహ్మణ్యం, సిబ్బంది కిషోర్, ఏసుబాబు, వెంకటేష్, ప్రవీణ్ , ఏహెచ్ఏఎస్ వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

వై.రామవరం: మండలంలోని తోటకూరపాలెంలో నిర్వహించిన కార్యక్రమంలో పశు వైద్యాధికారి యు.వీరేంద్ర మాట్లాడుతూ గ్రామంలో 140 పశువులకు, 70 మేకలకు డీవర్మింగ్ మందు వేసినట్టు చెప్పారు. సర్పంచ్ చిన్నమ్ములు, సిబ్బంది వెంకటరావు, సతీష్‌కుమార్, పండురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎటపాక: ఎటపాక, మురుమూరు గ్రామాల్లో నిర్వహించిన పశు వైద్య శిబిరాల్లో పశువైద్యాధికారి ఆధ్వర్యంలో పశువులకు టీకాలు వేశారు. సిబ్బంది నాగలక్ష్మి, ధర్మయ్య, రాంప్రసాద్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి


రహదారి నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, తదితరులు

అనంతగిరి(అరకులోయటౌన్): రహదారి నిర్మాణాన్ని నాణ్యతతో పది కాలలు ప్రజలకు ఉపయోగపడేలా పనులు చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులకు అరకులోయ ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం ఆదేశించారు. మండలంలోని గుమ్మ నుంచి సిరికిబిడ్డ రహదారి నిర్మాణ పనులకు ఆయన సోమవారం భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మత్స్యలింగం మాట్లాడుతూ ఈ రహదారి నిర్మాణం పూర్తయితే గత కొన్నేళ్లుగా ఆయా ప్రాంతవాసులు పడుతున్న రహదారి కష్టాలు తీరుతాయన్నారు. ఉపాధి హామీ పథకం నిధులు రూ.11లక్షలతో పనులు చేపడుతున్నామన్నారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్‌లకు ఆయన ఆదేశించారు. ఎంపీపీ శెట్టి నీలవేణి, జెడ్పీటీసీ సభ్యుడు దీసరి గంగరాజు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రేగబోయిన స్వామి, గుమ్మ, వాలసీ సర్పంచ్‌లు రేగబోయిన రాములమ్మ, శెంబి సన్యాసిరావు, ఎంపీటీసీ సభ్యురాలు శోభ జయశ్రీ, నాయకులు లక్ష్మణరావు, గంగరాజు, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

గోపాల్‌కు కన్నీటి వీడ్కోలు


గోపాల్ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

అరకులోయటౌన్: వైఎస్సార్‌సీపీ అరకు మండల కార్యదర్శి శెట్టి గోపాల్ అంత్యక్రియలు అశ్రునయానాల మడుమ సోమవారం నిర్వహించారు. అంతిమ యాత్రకు కన్నీటి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా గోపాల్ భౌతికకాయం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి అరకులోయ ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం నివాళులర్పించారు. మృతుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మత్స్యలింగం మాట్లాడుతూ గోపాల్ మృతి వైఎస్సార్‌సీపీకి తీరని లోటు అని చెప్పారు. మృతుడి కుటుంబానికి పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటూ సహాయ సహకారాలు అందిస్తుందని భరోసా ఇచ్చారు. ఎంపీటీసీ దురియా ఆనంద్‌కుమార్, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి శెట్టి అప్పాలు, సర్పంచ్ బి.బి.బొజ్జ, నాయకులు అశోక్, రాజ్‌కుమార్ లతోపాటు పలువురు పాల్గొని నివాళులర్పించారు.

గృహాల నిర్మాణాలు వేగవంతం


సూచనలిస్తున్న ఎంపీడీవో యాదగిరీశ్వరరావు

రాజవొమ్మంగి: మార్చి నెలాఖరుకల్లా మండలానికి ఇప్పటి వరకు మంజూరైన శాశ్వత గృహ నిర్మాణాలు అన్ని పూర్తి చేయాలని ఎంపీడీవో యాదగిరీశ్వరరావు అధికారులను కోరారు. ఈ మేరకు ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందాయన్నారు. ఆయన సోమవారం తన కార్యాలయంలో హౌసింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఏఈ వెంకట్రాజు మాట్లాడుతు 2022 ఏడాదిలో పీఎంఏవై గ్రామీణ్ పథకం కింద 272 ఇళ్లు మంజూరు కాగా వాటిలో 79 పూర్తయ్యాయని మిగిలినవి నిర్మాణ దశల్లో ఉన్నాయన్నారు. ఈ ఇళ్ళ యూనిట్ కాస్ట్ రూ. 1.80 లక్షలు అన్నారు. కాగా 2023-24లలో మండలానికి పీఎం జన్‌మన్ పథకం కింద 750 ఇళ్లు మంజూరు కాగా, 450 ఇళ్ల నిర్మాణం ప్రారంభించగా 34 ఇళ్ళు పూర్తయినట్టు తెలిపారు. వీటి యూనిట్‌కాస్ట్ రూ. 2.39 లక్షలు ఉందన్నారు. కార్యక్రమానికి ముందుగా స్పందన కార్యక్రమాన్ని ఎంపీడీవో యాదగిరీశ్వరరావు నిర్వహించారు. హౌసింగ్ సూపర్‌వైజర్ శ్రీనివాస్, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ


మాట్లాడుతున్న సూపరింటెండెంట్ సతీష్

అడ్డతీగల: ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని స్థానిక సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ పండా సతీష్ చెప్పారు. సీహెచ్‌సీ కౌన్సిలర్ వాసు ఆధ్వర్యంలో సోమవారం ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ సతీష్ మాట్లాడుతూ అనారోగ్యమైతే తక్షణమే వైద్యులను సంప్రదించాలని, జ్వరం వస్తే రక్త పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను వాసు వివరించారు.

నేటి నుంచి క్రీడాపోటీలు

ఎటపాక: మండలంలోని నల్లకుంట గిరిజన ఆశ్రమ పాఠశాలలో మంగళవారం నుంచి మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్టు ఎంఈవో సరియం రాజులు తెలిపారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని కబడ్డీ, ఖోఖో, అథ్లెటిక్స్ తదితర ఆటల పోటీలు నిర్వహిస్తున్నామని, అన్ని పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొవాలని సూచించారు.

కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలు నెరవేర్చాలి


అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

అరకులోయటౌన్: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల వాగ్దానాలను నెరవేర్చాలని కాంగ్రెస్ నాయకుడు పాచిపెంట చిన స్వామి డిమాండ్ చేశారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాచిపెంట శాంతకుమారి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపట్టినట్టు ఆయన తెలిపారు. ఈ మేరకు స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. కూటమి నాయకులు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలేదన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సంతబయలులో జరిగిన సభలో జీవో నంబర్-3కు చట్టబద్ధత కలిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారని, అయితే ఆయన ముఖ్యమంత్రి పదవి చేపట్టి ఏడు నెలలైనా నేటి వరకు హామీ నెరవేర్చలేదన్నారు. గిరిజన అభ్యర్థుల కోసం ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. నాయకులు భగత్‌రామ్, గంగాధర్, మంగు, బలభద్దర్, రఘురాం, మితుల తదితరులు పాల్గొన్నారు.

వయోజన విద్యకు ప్రాధాన్యం


పండ్ల మొక్కలను పంపిణీ చేస్తున్న దృశ్యం

రంపచోడవరం: వయోజన విద్యాభివృద్ధికి ప్రాధాన్యమిస్తున్నట్టు మాస్ వెల్ఫేర్ మినిస్ట్రీస్ స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ సీహెచ్.సుధాకర్ చెప్పారు. మండల కేంద్రంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా రంపచోడవరం, గంగవరం, మారేడుమిల్లి, వై.రాయవరం మండలాల్లో వయోజన విద్యా కేంద్రాలు ఏర్పాటుచేశామన్నారు. వయోజన విద్య ద్వారా నిరక్షరాస్యతను నిర్మూలించి, అక్షరాస్యతను పెంపొందించడం, ఆరోగ్య భద్రత, పరిసరాల పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ తదితర అంశాలపై గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు కాయగూరల విత్తనాలతో పాటు జామ, సపోట, నారింజ, బత్తాయి, దానిమ్మ తదితర మొక్కలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.